కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

తెలంగాణ తొలి అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి



బాధిత కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేస్తున్న మధుసూదనాచారి, కొప్పుల ఈశ్వర్, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్,

మంథని, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలంగాణ తొలి అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసుధనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలోని మహాముత్తారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జగన్ నాయక్, సురేశ్ మృతి చెందగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులర్పించారు. మహాముత్తారం మండలం మాదారంనకు చెందిన గంప రాజు, మంథనికి చెందిన ఎడ్ల శంకర్, మహదేవపూర్ మండలం బొమ్మపూర్‌కు చెందిన పీక మల్లయ్య, మద్దులపల్లికి చెందిన బాల్నే రాజయ్య, మంథని మండలం సూరయ్యపల్లెకు చెందిన వడ్లకొండ శ్రీనివాస్, కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన పిడుగు సంపత్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రూ. 2లక్షల విలువ చేసే పార్టీ బీమా చెక్కులు శుక్రవారం పంపిణీ చేశారు.

తగినంత బొగ్గు రవాణా చేయాలి

- వేసవి నేపథ్యంలో థర్మల్ విద్యుత్‌కు డిమాండ్
- రెండు నెలల్లో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి
- సింగరేణి సీఎండీ బలరామ్
- కొత్త గనుల ప్రారంభానికి చర్యలు

వీసీలో పాల్గొన్న సింగరేణి సీఎండీ

గోదావరిఖని/ రామగిరి ఫిబ్రవరి 2: రానున్న వేసవిలో విద్యుత్తు డిమాండ్ గరిష్టంగా ఉంటుందని.. ఈ నేపథ్యంలోనే థర్మల్ విద్యుత్తు కేంద్రాలు నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా సంస్థతో ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శుక్రవారం సింగరేణి భవన్ నుంచి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. దేశ ఇంధన అవసరాలకోసం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని అన్ని ఏరియాల జీఎంలకు ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించాల్సిందేనని, మిగిలిన రెండు నెలల కాలంలో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రవాణా చేయాల్సి ఉందని వివరించారు. ఇందుకు రోజుకు కనీసం 2.3 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలని, తెలిపారు. ఒడిశాలోని నైనీ, కొత్తగూడెంలోని వీకే కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీల ప్రారంభానికి అటవీ, పర్యావరణ అనుమతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొత్తం 19.80 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులను వీలైనంత త్వరగా ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాల్సిన రామగుండం-3 ఏరియాలోని ఆర్జీ కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని ఎంవీకే ఓసీకి సంబంధించిన అనుమతులకు ముమ్మరంగా ప్రయత్నించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఈడీ ఆల్విన్, జీఎంలు సురేశ్, రమేశ్, దేవేందర్‌తోపాటు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

ప్రణాళికలపై వీడియో కాన్ఫరెన్స్

సింగరేణి సీఎండీ బలరాం కంటిన్యూస్ మైనర్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, యంత్రాల పనితీరు, లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికల గురించి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికలు, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరు, బొగ్గు కటింగ్ సమయంలో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ 11వ గనిలో ఎప్పటికప్పుడు కంటిన్యూస్ మైనర్ల ద్వారా బొగ్గు కటింగ్ పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇక్కడ ఏజెంట్ చిలక శ్రీనివాస్, జాయి మైనింగ్ సర్వీసెస్ పీవో శుక్లా, జెన్‌కో పీవో రాకేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 2: ఎన్టీపీసీలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో ఈనెల 6న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్లమెంట్ సన్నాక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ ముఖ్యతిథిగా హాజరవుతారని తెలిపారు. బాధ్యతల్లో భాగస్వామ్యం కోసం పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్, శ్రీనివాస్, నాయకులు ఐలయ్య, దేవరాజ్, వేణు, మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జాహిద్ పాషా, మొగిలి, రవీందర్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 2: పట్టణంలోని చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. సైబర్ క్రైం సీఐ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. సైబర్ క్రైం బారిన పడిన వారు 1930టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ఏకాంతం, ఉపాధ్యాయులు ఉన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మె

జ్యోతినగర్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన అఖిల భారత సమ్మెలో రైల్వే కాంట్రాక్ట్, క్యాజువల్ వర్కర్స్ పాల్గొంటారని సీఐటీయూ అనుబంధ రైల్వే కాంట్రాక్ట్, క్యాజువల్ వర్కర్స్ యూనియన్ శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్ మేనేజర్‌కు సమ్మెనోటీసు అందజేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి మహేశ్ ఉన్నారు. సమ్మెకు మద్దతుగా ఎన్టీపీసీ, రామగుండం ఏరియాలోని బీమా కంపెనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి, ఏరియా కన్వీనర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, పురుషోత్తం, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, రవికాంత్ ఉన్నారు.

రామగిరి, పిబ్రవరి 2: ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం రఘుపతికి సమ్మె నోటీసు అందజేశారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ అశోక్, ఏఐటీయూసీ సతీశ్, సీఐటీయూ పాషా, టీఎన్‌టీయూసీ రవీందర్, ఉన్నారు.

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 2: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు శుక్రవారం జిల్లా పం చాయతీ అధికారికి సమ్మె నోటీస్ అం దజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యవతిరేక విధానాలు నిరసిస్తూ ఈ నెల 16న జరుగు దేశ వ్యాప్త సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి పేరిట .. మట్టి తరలింపు

- ప్రైవేట్ నిర్మాణాలకు సింగరేణి ఓసీపీ మట్టి ..
- ఓ ప్రజాప్రతినిధి పాత్ర ఉందని అనుమానాలు
- ఆలస్యంగా గుర్తించి నిలిపివేసిన వైనం..

గోదావరిఖని నగరంలోని పలు చోట్ల జరుగుతున్న ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తున్న సింగరేణి ఓసీపీ మట్టి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: పోచమ్మ పేరు చెప్పుకొని... పొట్టేలు మింగినట్టు... గోదావరిఖనిలో ఓ ప్రజాప్రతినిధి సింగరేణి ఓసీపీ నుంచి ఓవర్ బర్డెన్ (మట్టి)ని ప్రైవేటు నిర్మాణాలకు తరలించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గోదావరిఖని ఆర్‌సీవోఏ క్లబ్ సమీపంలో గల వార సంతలో పోచమ్మ గుడి నిర్మాణం కోసం మట్టి అవసరం ఉందని ఇటీవల ఓ ప్రజాప్రతినిధి ద్వారా సింగరేణి జీడీకే-5 ఓసీపీ నుంచి మట్టిని తరలించేందుకు అనుమతి తీసుకున్నారు. అభివృద్ధి పనుల కోసమని చెప్పడంతో సింగరేణి అధికారులు కూడా ఓబీ మట్టిని తీసుకువెళ్లేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఐతే సదరు ప్రజాప్రతినిధి మాత్రం ఆ మట్టిని పోచమ్మ గుడి నిర్మాణం కోసం కాకుండా నగరంలోని పలు ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం మార్కండేయ కాలనీలోని ప్రైవేటు కన్‌స్ట్రక్షన్‌కు ఓసీపీ-5 వెనుకాల సుందిళ్ల వైపు నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని లోడింగ్ చేసి బయటకు తరలిస్తుండగా, అనుమానం వచ్చి ఓ కార్పొరేటర్ ట్రాక్టర్‌ను అడ్డుకొని ఆరా తీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఈ విషయం ఆ మట్టి తరలింపు వెనుక ఉన్న ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లడంతో అటు సింగరేణి అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. దీంతో పోచమ్మ గుడి పేరిట ప్రైవేటు నిర్మాణాలకు ఓసీపీ మట్టి వెళ్తుందని గ్రహించిన సింగరేణి అధికారులను వెంటనే ఓసీపీ వద్దకు సిబ్బందిని పంపించి మట్టి తరలింపును అప్పటికప్పుడు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఐతే మరిన్ని రోజులు వారసంతలో పోచమ్మ గుడి నిర్మాణం పేరిట ట్రాక్టర్ల ద్వారా మట్టిని ఎక్కడికి తరలించారు.? ఎవరు తరలించారు..? ఎవరెవరి పాత్ర ఉందనేది బయటకు రావాల్సి ఉంది.

చలాన్ల వసూళ్లు అంతంతే..

- రామగుండం కమిషనరేట్ పరిధిలో దాదాపు రూ.20కోట్ల బకాయిలు
- 35 రోజుల్లో 51 శాతం పూర్తి
- రాయితీతో చెల్లింపులకు మిగిలింది 13 రోజులే..

పెద్దపల్లి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : రామగుండం కమిషనరేట్ పరిధిలో పెండింగ్ చలాన్ల వసూళ్లు అనుకున్నంతగా ముందుకు సాగడం లేదు. భారీగా రాయితీ ప్రకటించి 35 రోజులుగా ప్రత్యేకంగా చెల్లింపులకు అవకాశం ఇచ్చినా 51 శాతం మాత్రమే వసూలయ్యాయి. మరో మారు పెండింగ్ చలాన్ల వసూళ్లకు ఈ నెల 15 వరకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

7.90 లక్షల పెండింగ్ కేసులు..

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో 2018 నుంచి 2023 డిసెంబరు 26 వరకు జిల్లాలో 7,90,043 లక్షల పెండింగ్ కేసులు ఉండగా, దాదాపుగా వాహనదారులు రూ.20 కోట్ల వరకు జరిమానాలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబరు 27 నుంచి జనవరి 31 వరకు చలానాల చెల్లింపులకు రాయితీ ఇచ్చింది. ద్విచక్ర, మూడు చక్రాల వాహనాలకు 80 శాతం, నాలుగు చక్రాల వాహనాలకు(కార్లు) 60 శాతం, ఆర్టీసీ వాహనాలకు 90 శాతం రాయితీ ప్రకటించింది. ఈ జనవరి 30 వరకు 4,08,123 కేసులకు సంబంధించి రూ.2,92,67,290లు (51 శాతం) చెల్లించారు. ఇంకా 49 శాతం బకాయి ఈ నెల 15లోగా చెల్లించాల్సి ఉంది. ఇంకా 13 రోజులే మిగిలి ఉండడంతో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

వాహనదారులకు అవగాహన

వాహనదారులకు ఇలాంటి అవకాశం మళ్లీ రాకపోవచ్చు. పెండింగ్ చలానాలు చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకోవాలి. జరిమానాలు కట్టిన వారు మరోసారి ఇలాంటి తప్పులు చేయొద్దు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

-జే నర్సింహులు, ట్రాఫిక్ ఏసీపీ, రామగుండం పోలీస్ కమిషనరేట్

ఖాతాలోని రూ. 1.70 లక్షలు మాయం

సైబర్ క్రైం పోలీసులకు మహిళ ఫిర్యాదు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 2: సుల్తానాబాద్ పట్టణం స్వప్నకాలనీకి చెందిన అనసూయ బ్యాంకు ఖాతాలోని రూ. 1.70 లక్షలు మాయమయ్యాయి. శుక్రవారం విత్‌డ్రా చేసేందుకు వెళ్లిన ఆమెకు ఖాతాలో నగదు లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో అవాక్కయింది. రోదిస్తూ వెళ్లి సుల్తానాబాద్ ఠాణాలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కూతురు చదువు కోసం దాచిపెట్టిన డబ్బు నాకు తెలియకుండానే తస్కరించారని ఆమె ఆరోపించింది. ఇదే విషయమై పోలీసులు బ్యాంకు అధికారులను సంప్రదించగా ఖాతాదారు వేలిముద్రలతోనే నగదు విత్‌డ్రా చేశారని చెప్పారు. కానీ అనసూయ మాత్రం తాను విత్‌డ్రా చేయలేదని చెబుతున్నది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

కొలనూర్ సమ్మక్క ఏర్పాట్ల పై తహసీల్దార్ సమీక్ష

ఓదెల: గ్రామస్థులు, పాలకవర్గంతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓదెల, ఫిబ్రవరి 2: కొలనూర్‌లో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్ల గురించి తహసీల్దార్ యాకన్న శుక్రవారం పాలక వర్గం, గ్రామస్తులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జాతర జరిగే గట్టుల ప్రాంతంలోని స్థలాన్ని సందర్శించారు. ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌తో జాతర స్థలాన్ని శుభ్రం చేయించారు. ఇక్కడ చైర్మన్ శ్యాంరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ మౌనిక, గిర్దావర్ రాజేందర్, కార్యదర్శి మహేందర్‌రెడ్డి ఉన్నారు.

సారీ రోలింగ్ పాలిషింగ్‌లో ఉచిత శిక్షణ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: నాబార్డ్, స్పందన సేవా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైక్లీనింగ్‌లో ఉచిత శిక్షణను శుక్రవారం గోదావరిఖని చంద్రబాబు కాలనీలో 25వ డివిజన్ కార్పొరేటర్ సుమల తారాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఏజీఎం జయప్రకాశ్, స్పందన ఎన్జీవో అధ్యక్షురాలు శోభారాణి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఇక్కడ యోగా గురువు అన్నపూర్ణ, ఫ్యాషన్ డిజైన్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, సీడబ్ల్యూసీ సభ్యులు ఐలయ్య, దుర్గావాహిని, పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు రెండు బహుమతులు

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 2 : దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో జిలా విద్యార్థులు బహుమతులు పొందినట్లు డీఈవో మాధవి శుక్రవారం తెలిపారు. విజయవాడ మురళి కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎస్ఐఎస్ఎఫ్-2023 గురువారం ముగిసింది. పెద్దపల్లి మండలం రాగినేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కీర్తన (9వ తరగతి), సాత్విక (8వ తరగతి) తమ గైడ్ టీచర్ జగదీశ్వర్‌రెడ్డి సహకారంతో రూపొందించిన 'పోర్టబుల్ వీల్ చైర్ ర్యాంప్' ఎగ్జిబిట్ సీనియర్ విభాగంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ప్రదర్శనలో ఒకటిగా నిలిచి బహుమతి అందుకున్నది. బోధనోపరణాల విభాగం టీచర్ కేటగిరీలో సుల్తానాబాద్ మండలం పూసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేందర్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శన 'భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్' వారి ప్రత్యేక బహుమతి పొందింది. 'సదరన్ ఇండియా సైన్స్ ఫేర్' ముగింపు సమావేశంలో ఆంధ్ర రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, వీఐటీఎం బెంగళూర్ క్యూరేటర్ జ్యోతి మెహ్రా చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, ప్రధానోపాధ్యాయులు ఆగయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నంది రిజర్వాయర్ నింపేందుకు ఎల్లంపల్లి జలాలు



నంది పంప్‌హౌస్ డెలివరి సిస్టర్న్ ద్వారా ఎగిసి పడుతున్న జలాలు

ధర్మారం,ఫిబ్రవరి2: నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్ నింపేందుకుగాను ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు ఎత్తిపోతలు ప్రారంభమ్యాయి. ఈ రిజర్వాయర్ నుంచి గత నెల 29 నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు నాలుగు రోజుల పాటు ఒక మోటర్ ద్వారా నీటిని ఎత్తిపోయడం,రిజర్వాయర్ తూము నుంచి పలు గ్రామాల పంటలకు సాగు నీరు, ప్రతి రోజు ధర్మారం, వెల్గటూరు మండలాలకు మిషన్ భగీరథ పథకానికి నీటిని తరలించడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం కనిష్ఠ స్థాయికి తగ్గిపోయింది. రిజర్వాయర్ పరిస్థితి గురించి ఇక్కడి రైతులు ఆందోళన చెందడంతో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుబంధంగా నిర్మించిన నంది పంప్‌హౌస్‌లోని 6వ ప్యాకేజ్ పంప్ హౌస్‌లో శుక్రవారం 2వ మోటర్‌ను ఆన్ చేయడంతో డెలివరీ సిస్టర్న్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున ఎల్లంపల్లి ప్రాజెక్ట్ జలాల పంపింగ్ ప్రారంభమైంది. రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ వరకు నీటిని నింపుతామని అధికారులు తెలిపారు.

16న మున్సిల్ ప్రత్యేక సమావేశం

మంథని, ఫిబ్రవరి 2: మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌పై మెజార్టీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాసం నోటీస్‌పై ఈ నెల 16న మంథని మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 2: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ వ్యవహరించనున్నారని తెలిపారు.

హుస్సేన్‌మియా వాగులోకి ఎస్సారెస్పీ నీళ్లు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి02: పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు కృషితోనే చిన్నరాతోపల్లి హుస్సేన్‌మియావాగులోకి ఎస్సారెస్పీ నీళ్లు వచ్చాయని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వాగులో వరదప్రవాహాన్ని శుక్రవారం పరిశీలించారు.

పంచాయతీ పాలక వర్గం సభ్యులకు సన్మానం

ధర్మారం : తాజా మాజీ సర్పంచ్ సుధాకర్‌ను సన్మానిస్తున్న వార్డు సభ్యులు

ధర్మారం,ఫిబ్రవరి2: రచ్చపల్లి జీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తాజా మాజీ సర్పంచ్ మోర సుధాకర్‌ను సన్మానిం చారు. ఇక్కడ ఎంపీటీసీ రోజారాణి, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని గ్రామాల సర్పంచులకు ఆత్మీయ వీడ్కోలు స మావేశం నిర్వహించి సన్మానించారు. ఇక్కడ ఎంపీపీ సంపత్, జడ్పీటీసీ తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామ్మోహనాచారి, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీవో గోవర్ధన్, ఏఈ జగదీశ్, ఎంఈవో రాజయ్య, ఏపీవో మంజుల ఉన్నారు.

జూలపల్లి, ఫిబ్రవరి 2 : కీచులాటపల్లిలో పంచాయతీ పాలక వర్గం సభ్యులకు శుక్రవారం గ్రామస్తులు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. జూలపల్లిలో ఏడో వార్డు సభ్యుడు మానుమండ్ల సంపత్‌ను సన్మానించారు. ఇక్కడ నాయకులు శ్రీనివాస్, హన్మయ్య, తేజ్‌రాజ్ పాల్గొన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 2: రత్నాపూర్ గ్రామ అభివృద్ధి అందరి సహకారంతోనే జరిగిందని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అన్నారు. శుక్రవారం జీపీ ఆవరణలో సెక్రటరీ రమ్య, ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్ శ్యామల ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని సన్మానించారు. ఇక్కడ ఉపసర్పంచ్ సత్యారెడ్డి, వార్డు సభ్యులు సురేశ్, శంకర్, రవి, సదాలక్ష్మి, చామంతి, కృష్ణ, మధుకర్‌రావు, మల్లయ్య, ఎంఎల్‌హెచ్‌పీ నవ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

317జీవోను రద్దు చేయాలి

ఓదెల, ఫిబ్రవరి 2: 317జీవోను వెంటనే రద్దు చేయాలని డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓదెల హైస్కూల్లో డీటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ అమృత కిశోర్, రమేశ్, కిరణ్, చంద్రమౌళి, సుమన్, రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

గాంధీజీ వర్ధంతి సభ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: గాంధీజీ ప్రవచించిన గ్రామ స్వరాజ్యం ద్వారా రామరాజ్యం సిద్ధిస్తుందని కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేశ్ పేర్కొన్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల స్నేహ సాహితీ గ్రంథాలయంలో శుక్రవారం గాంధీజీ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దయానంద్ గాంధీ, యాదవరాజు, సదానందం, ప్రకాశ్ రెడ్డి, నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

జూలపల్లి, ఫిబ్రవరి 2 : కుమ్మరి కుంటలో శుక్రవారం ఏవో ప్రత్యూష పంట పొలాలు సందర్శించారు. వరి పంటలో మొగి, రెక్కల పురుగు ఉధృతంగా ఉందనీ, వెంటనే రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఏఈవో శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

జూలపల్లి, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలో శుక్రవారం 'తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్ విడుదల చేశారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు విజయేందర్, అసోసియేట్ అధ్యక్షుడు రమేశ్, కమిటీ సభ్యురాలు వనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రేరణ తరగతులు

ఓదెల, ఫిబ్రవరి 2: పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి శుక్రవారం ఓదెల జడ్పీ హైస్కూల్లో ప్రేరణ తరగతులు ప్రారంభించారు. మండలంలోని 6 పాఠశాలలో 120 మంది విద్యార్థులకు ఈ తరగతులను మార్చి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఎంఈవో రాజయ్య, ఎంపీడీవో సత్తయ్య, హెచ్ఎంలు